ప్రజాశక్తి

సోమవారం 7 ఏప్రిల్ 2025

8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

అమ్మో... హైవే!



- కృష్ణలంక జాతీయ రహదారిపై పెరిగిన రద్దీ
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- రహదారి పక్కనే మద్యం అమ్మకాలు, యథేచ్ఛగా గంజాయి
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-విజయవాడ

ఒక వైపు ట్రాఫిక్ ఇబ్బందులు, మరొక వైపు మద్యం అమ్మకాలు... ఇంకొక వైపు గంజాయి బ్యాచ్ హడావుడితో కృష్ణలంక ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా స్థానిక రాజీవ్‌గాంధీ పార్కు ఏరియా నుంచి వారధి వరకు పెరిగిన ట్రాఫిక్ రద్దీతో కృష్ణలంకలో నుంచి హైవేని దాటి నగరంలోకి రాకపోకల సమయంలో ఏ నిమిషం ఏమి జరుగుతుందోననే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఉగాది పండుగ రోజు మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఓ ఆర్‌టిసి బస్సు రహదారి దాటుతున్న 35-40 సంవత్సరాల వయస్సు కల్గిన ఒక వ్యక్తిని ఢీకొట్టడంతో రహదారిపై అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన సంఘటన హృదయ విదారకంగా ఉంది. ఇదే రీతిలో బస్టాండ్ సెంటర్ నుంచి వారధి వరకు ఇటువంటి దారుణమైన ఘటనలు వారంలో రెండో మూడో చోటుచేసుకుంటూ గాలిలో ప్రాణాలు కలిసిపోతున్నాయి. పలువురు క్షతగాత్రులవుతున్నారు.

ఉగాది రోజు జరిగిన ప్రమాదంలో మృతిచెందిన యువకుడు (ఫైల్)

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, ట్రాఫిక్ పోలీసులు, రోడ్డు ట్రాన్స్‌పోర్టు, ఆర్‌అండ్‌బి తదితర శాఖల అధికారులు కనీస ప్రమాణాలు విస్మరిస్తూ పట్టించుకోకపోవడంతో పెరిగిన వాహనాల రద్దీతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు రోడ్డు సిగ్నల్స్, జీబ్రాలైన్స్ లేకపోవడం, వాహనాల అతి వేగంతో ప్రమాదాలకు నిలయంగా మారి తరుచూ యాక్సిడెంట్స్ చోటుచేసుకుంటున్నాయి. బస్‌స్టేషన్ ఇన్‌గేట్, ఔట్ గేట్, బస్‌స్టేషన్ ప్రధాన ఆర్చ్ ప్రాంతాల్లో ఆటోలు, కార్లు, ట్రావెల్స్, ఇతర వాహనాలను ప్రధాన రహదారిపై భారీ స్థాయిలో పార్కింగ్ చేస్తుండటంతో వాటిని దాటుకొని నడిచే పరిస్థితి లేకుండా పోయింది. బస్టాండ్ దగ్గర నుంచి కృష్ణలంక సబ్-వే వరకు కూడా రహదారి పక్కనేట్రావెల్స్, టాక్సీలు, ఆటోలు రహదారిపక్కనే పార్కింగ్ చేసి (మిగతా 2లో)

మోదుమూడిలో విషాదఛాయలు

కృష్ణానదిలో స్నానానికి దిగి ముగ్గురు బాలురు మృతి

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ మండలం మోదుమూడి గ్రామంలో విషాదం నెలకొంది. శ్రీరామనవమి సందర్భంగా కృష్ణానదిలో స్నానానికి దిగి ముగ్గురు బాలురు మృతిచెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన ప్రకారం... మోదుమూడి గ్రామంలో గ్రామస్తులంతా కలిసి శ్రీరామ స్థూపాన్ని కృష్ణానదికి తీసుకువెళ్లి స్నానమాచరించి గ్రామానికి తీసుకొచ్చి రామాలయంలో ఉంచి పూజలు చేయడం ఆనవాయితీ. గ్రామానికి చెందిన మత్తి యతి రాజకుమార్(16), మత్తి గోపి కిరణ్(15), మత్తి వీరబాబు(15) ఆదివారం గ్రామంలోని రామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన మరి కొంతమందితో కలిసి కొత్తపేట వద్ద ఉన్న కృష్ణానదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. నదిలో లోతు ఎక్కువ ఉన్న ప్రాంతంలో దిగడంతో ముగ్గురు బాలురు గల్లంతయ్యారు. వీరితో పాటు వచ్చిన మరి కొంతమంది ముగ్గురిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. అవనిగడ్డ ఎంఎల్‌ఎ తనయుడు మండలి వెంకట్రాం, డిఎస్‌పి టి.విద్యా శ్రీ, సిఐ యువకుమార్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్ల సహాయంతో ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ యువకుమార్ తెలిపారు. గోపికిరణ్, వీరబాబు తొమ్మిదో తరగతి చదువుతుండగా రాజకుమార్ వ్యవసాయ పనులకు వెళ్తున్నాడు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు మృతిచెందడంతో ఆ కుటుంబాలతో పాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రాజకుమార్

గోపికిరణ్

వీరబాబు

రాజధానిలో అద్దెల భారం

బస్టాండ్, సత్రాల్లోనే కార్మికుల అవస్థలు

తుళ్లూరు ఆర్టీసి బస్టాండ్ లో నేలపై దోమతెర కట్టుకొని నిద్రిస్తున్న కార్మికులు

వార్త 2లో

వైభవోపేతంగా సీతారాముల కళ్యాణం

విజయవాడ ఇంద్రకీలాద్రిపై సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న పూజారులు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు

- సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీకి స్టోరేజీ పాయింట్లు
- కృష్ణాజిల్లా సమగ్ర శిక్ష ఎపిసి ఫణి ధూర్జటి

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు కృష్ణాజిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటరర్ ముదిగొండ ఫణి ధూర్జటి తెలిపారు. ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎంశ్రీ), రెన్యూవల్ వర్కు ప్లాన్‌లో పలు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలల పున:ప్రారంభానికి ముందుగానే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీకి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫణి ధూర్జటి వివరించారు.

ప్రశ్న: కృష్ణాజిల్లాలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కృలన, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి?

జవాబు: రెండు దశల్లో పిఎం శ్రీ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులున్న 29 పాఠశాలల్లో రూ.5.99 కోట్లతో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ఎంపికైన ప్రతి పాఠశాలలోనూ గ్రంథాలయం, సైన్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లు, ఆట స్థలం ఏర్పాటు చేస్తున్నాం. కెమిస్ట్రీ ల్యాబ్‌లు 12 పూర్తయ్యాయి. 11 తుది దశలో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగానే 8, 9, 10 విద్యార్థులకు వ్యవసాయం, ఐటి, మెకానికల్ తదితర 8 ట్రేడ్స్‌పై ఒకేషనల్ (వృత్తి) విద్యను అందించడం జరుగుతోంది. దీనికి ఒక్కో పాఠశాల్లో వృత్తి విద్యలో శిక్షణకు ఇద్దరు సిబ్బందిని ఏర్పాటు చేశాం. మూడో దశలో పిఎం శ్రీకి 41 పాఠశాలలను గుర్తించి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే ఆయా పాఠశాలల్లో పనులు చేపడతాం. రెన్యూవల్ వర్కు ప్లాన్‌లో గతంలో 12 పాఠశాలల్లో నిలిచిన పనులను తిరిగి నిర్వహించడానికి ప్రభుత్వం రూ. 2 కోట్లు మంజూరు చేసింది. నాడు-నేడులో అసంపూర్తిగా నిలిచిన 260 పాఠశాలలకు సంబంధించి అభివృద్ధి పనుల వివరాల నివేదికను ప్రభుత్వానికి అందించాం.

ప్రశ్న: పాఠశాలల అభివృద్ధికి మార్గదర్శకం ఇవ్వడానికి కౌన్సిలర్‌లను ఏర్పాటు చేశారా?

జవాబు: డ్రాప్ అవుట్స్ తగ్గించడానికి, పదో తరతగి తర్వాత ఉన్నత చదువుల ఎంపిక గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి కౌన్సిలర్‌లను నియమించాం. గత విద్యా సంవత్సరం చివరి (మిగతా 2లో)

రాజధానిలో అద్దెల భారం

బస్టాండ్, సత్రాల్లోనే కార్మికుల అవస్థలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో భూమి ధరలే కాదు, ఇంటి అద్దెలు కూడా భారీగా పెరిగాయి. చిన్న ఇల్లు కావాలన్నా అద్దె రూ.10 వేలు పైమాటే. డబుల్ బెడ్ రూముకు రూ.15 వేలకు పైమాటే. తుళ్లూరు ప్రాంతాన్ని ప్రభుత్వం రాజధానిగా ప్రకటించాక భూముల ధరలు పెరిగాయి. దాంతో కొంతమంది తమకున్న భూముల్లో కొన్నెకరాలు అమ్ముకుని భారీ భవనాలు నిర్మించారు. ఇళ్లను ఆదాయ మార్గంగా భావించి ఖర్చుకు వెనుకాడకుండా అన్ని వసతులతో నిర్మించారు. ఇతర ప్రాంతాల నుంచి కార్మికులు, ఉద్యోగులు, ఇతరులు పెద్ద సంఖ్యలో రాజధానికి వస్తారని, ఇళ్లకు బాగా గిరాకీ ఉంటుందని ఆశపడ్డారు. అయితే 2019 ఎన్నికల్లో టిడిపి ఓడిపోయి వైసిపి అధికారంలోకి రావడం, అమరావతి నిర్మాణాన్ని పట్టించుకోక పోవడంతో ఇళ్ల యజమానులకు కష్టాలు మొదలయ్యాయి. కొత్త వారు అద్దెలకు రాకపోగా అప్పటివరకు ఉన్న కొద్దిమంది కూడా ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయారు. దీంతో వైసిపి ఐదేళ్ల పాలనలో చాలా భవనాలకు 'టూ లెట్' బోర్డులు దర్శనమిచ్చాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి రాజధాని గ్రామాల్లో అద్దెలు అనూహ్యంగా పెరిగాయి. చిన్న రేకుల షెడ్డు కావాలన్నా రూ.5 వేలు అంటుండడంతో రోజువారీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నిర్మాణ సంస్థలు తమ వద్ద పనిచేసే కార్మికుల కోసం షెడ్డులు నిర్మిస్తున్నారు. తుళ్లూరులోని అయ్యన్న చెరువు కాలనీకి సమీపంలో ప్రధాన రహదారి పక్కన కొంతకాలంగా షెడ్డుల నిర్మాణం జరుగుతోంది. ఇక్కడ కార్మికుల కోసం 30కి పైగా షెడ్డులను నిర్మిస్తున్నారు. ఇప్పటికే రోజువారీ కూలి పనులకు వచ్చిన కార్మికులు మాత్రం ఇళ్ల అద్దెలు కట్టలేక రాత్రి వేళల్లో బస్టాండ్‌లు, సత్రాల్లో తలదాచుకుంటున్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు కట్టుకొని నేలపై నిద్రిస్తున్నారు. రాజధాని నిర్మాణ పనులు మొదలైతే కార్మికులు పెద్ద సంఖ్యలో రాజధానికి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కార్మికులందరికీ వసతి, భద్రత, ఆరోగ్యం తదితర సౌకర్యాలను ప్రభుత్వం ఏ మేరకు కల్పించ గలుగుతుందనే సందేశాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

రాజధానిలో కార్మికుల కోసం షెడ్ల నిర్మాణం

నేడు పేదలకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పేదలకు శాశ్వత ఇంటి పట్టాలును మంత్రి నారా లోకేష్ సోమవారం ఉదయం 9 గంటల నుండి మంగళగిరి మండలం ఎర్రబాలెం డాన్ బాస్కో స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రాంగణంలో పంపిణీ చేయనున్నారు. అందులో భాగంగా ఉదయం కొలనుకొండ గ్రామానికి చెందిన - 231, పద్మశాలి బజార్ - 127, మధ్యాహ్నం పెనుమాక - 179, ఉండవల్లి - 77, ఇప్పటం -10 మొత్తంగా 624 మంది లబ్దిదారులకు ఏప్రిల్ 7 న శాశ్వత ఇంటి పట్టాలు నారా లోకేష్ అందజేస్తారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు

రెండు నెలల్లో నలుగురు కౌన్సిలర్‌లను నియమించాం. ఒక్కొక్కరు వారానికి ఒక్కో పాఠశాల చొప్పున ఎనిమిది పాఠశాలల్లో కౌన్సిలింగ్ ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరంలో కౌన్సిలర్‌ల సంఖ్య పెంచి అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

ప్రశ్న: సర్వపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీకి ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: విద్యా సంవత్సరానికి ప్రారంభానికి ముందుగానే కిట్లు పంపిణీ పూర్తి చేయడానికి సన్నాహాలు చేశాం. దీనిలో భాగంగా 25 మండలాల్లోనూ 25 స్టోరేజీ పాయింట్లు ఏర్పాటు చేశాం. ఇద్దరు ఎంఇవోలు, ఇద్దరు సీనియర్ ఉపాధ్యాయులు, మరో ఇద్దరు మండల స్థాయి సమగ్ర సిబ్బంది(సిఆర్‌పి)లతో మండల కమిటీని ఏర్పాటు చేశాం. ప్రభుత్వం కిట్లు సరఫరా చేయగానే స్టాక్ పాయింట్ల నుంచి నేరుగా పాఠశాలలకు పంపుతాం. అక్కడ విద్యార్థులకు అందిస్తారు.

ప్రశ్న: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల నాణ్యత పెంచడానికి, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్‌మిషన్ (ఎస్‌ఎఎల్‌టి)ప్రోగ్రాం తీసుకు వచ్చింది. ఈ ప్రోగ్రాంలో భాగంగా ఫౌండేషన్ లెట్రసీ అండ్ న్యూమరిసీ (ఎఫ్‌ఎల్‌ఎన్)లో జిల్లాలోని 492 మంది ప్రధానోపాధ్యాయులకు 12 రోజులు, 1707 మంది అంగన్‌వాడీలు, 963 ఎస్‌జిటిలకు ఆన్‌లైన్‌లో కొన్ని రోజులు ఫిజికల్‌గా కొన్ని రోజులు మొత్తం 120 రోజులు శిక్షణ ఇచ్చాం. టీచ్ టూల్ (టిఎఆర్‌ఎల్)లో 670 మంది టీచర్లకు శిక్షణ పొందారు. ఈ 670 మంది శిక్షణ పొందిన టీచర్లు జిల్లాలోని 4,230 మంది టీచర్ల బోధనను పర్యవేక్షిస్తారు. ప్రత్యక్షంగా పాఠశాలల్లో టీచర్లు క్లాస్ రూమ్‌లలో చేసే బోధనను పర్యవేక్షించి ఎప్పటికప్పుడు లోపాలను సవరిస్తున్నారు.

124వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 124 రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో వై యెహెూషువ, సిహెచ్ పిచ్చయ్య, బి నవనీతం, యోహాను, కె హగ్గయ్య కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కె.స్టీవెన్, కె.ఆదినారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, ఎస్.కె.భాష, ఎం.సాంబశివరావు, డి.మాణిక్య రావు, బి. సూర్యప్రకాష్ రావు, ఎం.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

బిటి రణదివే వర్ధంతి

ప్రజాశక్తి- తాడేపల్లి

సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు, 1970 దశకంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని కార్మిక సంఘం ఏర్పాట్లు కీలక పాత్ర పోషించిన బిటి రణదీవే 35 వర్ధంతి ఆదివారం స్థానిక ప్రకాష్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రణ దీవె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ రణదీవే మృతి కార్మిక వర్గానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో బి.ప్రభాకర్ రావు, బాబురావు, బి.వెంకటేశ్వర్లు, వెంకన్న, సూరి, బి.అంకయ్య, నవనీతం, ఆశీర్వాదం, సాంబ య్య, ఎస్.కే.జానీ, రమణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

రబీపై రైతుల ఆశలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

డెల్టా ప్రాంతంలో ప్రధాన రబీ పంటలైన మొక్కజొన్న జన్న పెసలు మినుములు నూర్పిడిలు ప్రారంభమ య్యాయి. ఖరీఫ్‌లో ధాన్యం ధరలు తగ్గి నష్టపోయిన రైతులు రబీ మీద పుట్టెడు ఆశలు పెట్టుకున్నారు. ఈ సంవత్సరం రబీలో జొన్న ఎకరాకు 25 క్వింటాళ్లు, మొక్కజొన్న 35 క్వింటాళ్ల వరకు దిగుమతి వస్తుండగా మినుము కూడా ఆశించిన మేర ఎకరాకు 6 నుండి 8 బస్తాలు దిగుబడి వస్తోంది. అయితే పెసర పంటపై వాతావరణ ప్రభావం తీవ్రంగా ఉండటంతో దిగుబడి తీవ్రంగా తగ్గింది. ఎకరాకు మూడున్నర నుండి 5 బస్తాల వరకే దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. మండల వ్యాప్తంగా పెసర మినుము సాగు నామ మాత్రమే. 21 వేల ఎకరాల మాగాణి భూములలో పెనుమూలి, కేఆర్ కొండూరు ప్రాంతాలలో 2000 ఎకరాలలో మాత్రమే పెసర మినుము సాగు చేయబడుతుంది. మిగతా 19 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేయబడుతుంది. ప్రస్తుతం జొన్న క్వింటా రూ.1950, మొక్కజొన్న రూ.2100, పెసర రూ.7000 మినుములు రూ.7200 పలుకుతున్నాయి. పంట నిల్వ చేస్తే ఇంకా ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపారస్తులు తెలిపారు. గత సంవత్సరం మొక్కజొన్న రూ.2960 ఆల్ టైం గరిష్ట ధర పలికినది. అయితే డెల్టా ప్రాంతంలో ఎక్కువ భాగం కౌలు రైతులే ఉన్నారు. అప్పు చేసి వ్యవసాయం చేస్తుంటారు అందువలన ఎక్కువ మంది రైతులు పంట నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. వ్యాపారస్తులు నిలువ చేసి లాభాలు పొందుతారు. ఖరీఫ్‌తో పోల్చుకుంటే రబిలో రైతులకు ఊరట లభించింది.

అమ్మో... హైవే!

అలాగే ఉంచడంతో కొన్ని సందర్భాల్లో అదుపు తప్పి, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో కృష్ణలంక నుంచి నగరంలోకి రహదారిపై రాకపోకలు చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించక తప్పడం లేదు. రహదారి మధ్యలో లైటింగ్ వ్యవస్థ కూడా సరిగా లేక సుదురు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు, స్థానిక వాహనాలు సైతం అతి వేగంతో ఎదురుగా వచ్చే వారిని ఢీకొట్టి ఎటువంటి ఆధారాలు కూడా లేకుండా వెళ్తున్న సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. తరుచూ ఇటువంటి రోడ్డు ప్రమాదాలు పోలీసుల రికార్డులకు ఎక్కేవి బహుతక్కువ అయితే...లెక్కలోకి రానివి కోకొల్లలని చెప్పక తప్పదు. రహదారిపై భద్రతా ప్రమాణాలు పాటించాలని, తగిన జాగ్రత్తలుతీసుకోవాలని చెప్పే అధికారులు లేకుండాపోయారు.

కృష్ణలంక ప్రధాన రహదారి పక్క దిగువన ఫీడర్ రోడ్డు మార్గంలోనే విజయా బార్, దుర్గాభార్ అండ్ రెస్టారెంట్లు, లెగసె బార్, అలాగే 20వ డివిజన్ పరిధిలో మరొక బార్ ఉండటం, వీటి పరిధిలోనే లెక్కకు మించి ఎటువంటి లైసెన్స్ లేకుండా బెల్ట్ షాపులు విచ్చల విడిగా మద్యం అమ్మకాలు 24x7 అన్న పద్ధతిలో జరుగుతుండటంతో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోవడానికి కూడా ఒక కారణంగా పోలీసుల రికార్డులే విధితం చేస్తున్నాయి. తాగిన మైకంలో ఫీడర్ రోడ్డు, ఈ బార్ అండ్ రెస్టారెంట్ల పరిధిలో గృహాల మధ్యలోనే తాగుబోతులు వీరంగం వేస్తూ స్థానిక ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నారు. ముఖ్యంగా 22వ డివిజన్‌లోని విజయాబార్ అండ్ రెస్టారెంట్‌నిర్వహణ హద్దు లేకుండా పోయింది. ఎక్సైజ్ విభాగం, సివిల్ పోలీసులు ముడుపులు మత్తుల్లో మునిగితేలుతూ విధులు నిర్వర్తించడం పూర్తిగా విస్మరించారని చెప్పక తప్పదు. ఇదే పరిస్తితి నగర వ్యాప్తంగా ఉన్న ముఖ్యంగా కృష్ణలంక ఏరియాల్లో మద్యం అమ్మకాలు హద్దు లేకుండాపోయింది. రాత్రింబవళ్లు జోరుగా అమ్మకాలుచేస్తూ భారీ మొత్తంలోసొమ్ము చేసుకుంటున్నారు. పీకల్లోతు తాగిన మైకంలో ఫీడర్ రోడ్డులోనే పడిపోయిన మందుబాబులను దాటుకుంటూనే ప్రధాన రహదారిపైకి మహిళలు, విద్యార్థినులు వెళ్లక తప్పడం లేదు. కృష్ణలంక పద్మావతి ఘాట్, స్వర్గపురి, కృష్ణాపరివాహక ప్రాంతం రామలింగేశ్వర్ నగర్ పరిసర ప్రాంతాల పరిధిలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు జోరుగా సాగుతూ దాని మత్తులో యువత జోగుతూ అసాంఘిక కార్యకలాపాలకు, స్థానిక ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్న విషయాలు కృష్ణలంక పోలీసులకు బహటంగా తెలుస్తున్నా ఏమి చేయలేని నిస్సాహాయ స్థితిలో పోలీసులు కూడా ఉండిపోవాల్సి వస్తోందని పలువురు పోలీసులే విధితం చేస్తున్నారు. గంజాయి, మద్యం, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పోలీసుల వద్ద ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తున్నా...తగిన సంఖ్యలో పోలీసుల సంఖ్య లేకపోవడంతో వారు కూడా ఏమి చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. ఒరిస్సా, విశాఖ ఏజెన్సీ తదితర ప్రాంతాల నుంచి కరివేపాకు, ఇతర కూరగాయల సరుకులు వచ్చినట్లుగానే ఎటువంటి ఆటంకాలు లేకుండానే గంజాయి విజయవాడ ఏరియాకు సరఫరా అవుతున్నా..దానిని ఎక్కడ కట్టడి చేయాలో అక్కడ కట్టడి చేయాలి కానీ...ఇక్కడ పూర్తి స్థాయిలో నియంత్రణ చేయడం కష్టమని పోలీసు అధికారులే ప్రయివేటు సంభాషణల్లో వ్యక్తం చేస్తుండటం గమనార్హం. ఇప్పటికయినా సంబంధిత అధికారులు రహదారి ప్రమాదాల నివారణతో పాటు మద్యం, గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని యిఔష్ణలంక వాసులు కోరుతున్నారు.

రాములోరి కళ్యాణం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మన్నె వారి బజార్ గౌతమ్ బుద్ధ రోడ్డు వద్ద వేసవిని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ మన్నెం అరుణ దంపతులు, ఎస్వీఆర్ ఫ్రెండ్ సర్కిల్, మన్నెం యూత్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని మన్నెం దంపతులు ప్రారంభించారు. తొలి రోజు శ్రీరామనవమి పర్వదినం కావడంతో మంచినీటితోపాటు పానకం పంపిణీ చేశారు. అనంతరం నిర్వాహకులు మన్నెం శ్రీనివాసరావు మాట్లాడారు. ఐదు సంవత్సరాల నుంచి ప్రతి వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, ఆ క్రమంలోనే ఈ ఏడాది కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి కాలం అంతా చలివేంద్రం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు ఆలూరు ఉమామహేశ్వరరావు, పోతినేని వెంకటేశ్వరరావు, రాయన శ్రీనివాసరావు, పుట్టగుంట సురేష్, ఆలూరి బ్రహ్మయ్య, కాకర్ల నాగేశ్వరరావు మన్నెం సాంబశివరావు, శ్రీనివాసరావు, బిట్రా శివ శంకరరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

గుడివాడలో పాల్గొన్న దేవాదాయ శాఖ కృష్ణాజిల్లా అసిస్టెంట్ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు తదితరులు



గుడివాడలో పాల్గొన్న రావి వెంకటేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరులో ఆదివారం వాడ వాడలా శ్రీరామనవమివేడుక నిర్వహించి సీతారాముల కళ్యాణం నేత్రపర్వంగా జరిపించారు. రామాలయాలతో పాటు ఆంజనేయస్వామి ఆల యాలు, కూడళ్లలో పందిళ్లు వేసి సీతారామ కళ్యాణం చూడముచ్చటగా జరిపారు. పాతస్టేట్ బ్యాంక్ రోడ్డు కోదండ రామాలయం వద్ద నిర్వహించిన సీతారామ కళ్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కనులార గాంచారు. బొల్లా నాని దంపతులతో పా టు మరో ముగ్గురు దంపతులు పీటలపై కూర్చుని రాములోరి కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. స్వామివారికి కళ్యాణానికి మాజీ చైర్మన్ జంపాన పూర్ణచం ద్రరావు, అర్జునరావు, రుద్రయ్య సోదరులు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు అం దచేశారు. సీఐ రామారావు సీతారామ కళ్యాణోత్సవంలో పాల్గొని భక్తులనుద్దేశించి మా ట్లాడారు. నాయిబ్రాహ్మణ రామాల యం, కాపుల రామాలయం, యాదవ రామాలయంతో పాటు పలు రామాలయాలు, మండల పరిధి చినఓగి రాల, ఆకునూరు తదితర గ్రామా లలో రామాలయాల వద్ద సీతారామ కళ్యాణం వైభవంగా నిర్వహించారు.

అన్నసమారాధన : శ్రీరామనవమి పురస్కరించుకుని ఉయ్యూరులో రామాలయాల వద్ద అన్న సమారాధన చేశారు. కోదండ రామాలయం వద్ద 3వేల మందికి అన్న సమారాధన చేయగా పరిస రప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారి ప్రసాదం స్వీకరించారు నాయిబ్రా హ్మణ రామాలయం, కాపుల రామాలయం వద్ద అన్న సమారాధన చేశారు. కోదండ రామాలయ కమిటీ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని సేవలందించారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : చల్లపల్లిలోని తూర్పు వీధి రామాలయం ఉప్పల వారి రామాలయం, రజక పాలెంలోని రామాలయం, బస్టాండ్ సెంటర్లో రామాలయం, ఎస్టీ కాలని, నారాయణరావు నగర్ శ్రీ ప్రసన్న భక్తాంజనేయ స్వామి ఆలయం, తదితర ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. చల్లపల్లి ప్రధాన సెంటర్లో శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం వద్ద నవమి వేడుకలు జరగగా అవనిగడ్డ డిఎస్పి టి. విద్యా శ్రీ, నేతల కొనకళ్ల బుల్లయ్య, మండలి వెంకట్రాం, సిఐ కె. ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. రామా నగరంలోని శ్రీ కోదండ రామా లయం, లక్ష్మీపురం, మంగళాపురం, మాజేరు, పురిటిగడ్డ మేకవారిపాలెం, పాగోలు, నడకుదురు వెలివోలు, వక్కలగడ్డ, యార్లగడ్డ గ్రామాలలో రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆల యాలు, విష్ణాలయాల్లో వేడుకలు జరిగాయి ఈ సంద ర్భంగా పలుచోట్ల అన్న సమారాధన జరుగగా ప్రతి ఆలయంలోనూ భక్తులకు పానకం వడపప్పు పంపిణీ చేశారు.

మోటూరులో ఘనంగా వేడుకలు

ప్రజాశక్తి - గుడివాడ : రెండవ భద్రాద్రిగా ప్రసిద్ధిగాంచిన గుడివాడ రూరల్ మండలం మోటూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎంతో ప్రాచీనత కలిగిన మోటూరు ఆలయాంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం నిత్యహోమం, గ్రామ బలిహరణము నిర్వహించి స్వామి వారి కళ్యాణాన్ని నిర్వహించారు. భద్రాచలంలో స్వామి వారి కళ్యాణం ముగిసిన అనంతరం ఇక్కడ జరిగే తిరుక్కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ వంశపారంపర్య ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, స్టేడియం కమిటి చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య రాష్ట్ర కార్పొరేషన్ వైస్ చైర్మన్ గోకవరపు సునీల్, టిడిపి నాయకులు దింట్యాల రాంబాబు, వెనిగండ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

అలాగే స్థానిక బేతవోలులోని ఇందిరనగర్ కాలనీలోని శ్రీ సీతారామ లక్ష్మణ అంజనేయస్వామి వార్ల ఆలయంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, స్టేడియం కమిటి చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య రాష్ట్ర కార్పొరేషన్ వైస్ చైర్మన్ గోకవరపు సునీల్, టిడిపి నాయకులు దింట్యాల రాంబాబు, వెనిగండ్ల రామకృష్ణ, జగన్‌మోహనరావులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు. స్థానిక అంజనేయపపేటలోని రామాలయంలో జరిగిన కళ్యాణ మహోత్సవంలో న్యాయమూర్తులు, న్యాయ వాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవీరాంజనేయ స్వామివారి దేవస్థానంలో కళ్యాణం

ప్రజాశక్తి - పామర్రు(గుడివాడ) : పామర్రు మండలం ఉండ్రపూడి-పోలవరం క్రాస్‌రోడ్‌లో ఉన్న శ్రీవీరాంజనేయ స్వామివవారి దేవస్థానంలో శ్రీరామనవమిని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించార. ఈ సందర్భంగా 12మంది జంటలు(దంపతులు) పీఠలపైకూర్చుని కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణమహోత్సవంలో దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ నూతక్కి వెంకటసాంబశివరావు, గుడివాడ, నందిగామ డివిజన్‌ల ఇన్‌స్పెక్టర్లు శ్రీ స్వాఇమివారిని దర్శించుకోగా వారిని ఆలయ ఈవో పివిఎన్‌వి ప్రసాదరావు కమీషనర్‌ను సన్మానించారు.కళ్యాణ మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు తాడిశెట్టి వెంకటేశ్వరరావు, మట్టా వెంకటేశ్వరరావు, వెన్నా శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : దానాల న్నీటిలో అన్నదానం గొప్పదని చోరగుడి గ్రామ సర్పంచ్ కందిమల్ల పూర్ణకుమారి అన్నారు. ఆదివారం మండలంలోని చోరగుడిలోని రామాలయంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో తాడేపల్లిగూడెం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం దంపతులు పీఠం మీద కూర్చుని స్వామివారికి కళ్యాణం జరిపారు. అనంతరం ఐదు వందల మందికి పైగా అన్నదానం నిర్వహించారు. టిదిపి నాయకులు నరేష్ పాల్గొన్నారు.



పమిడిముక్కల మండలంలో...

శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎస్‌పి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని పోలీస్ రామా లయం వారు నిర్వహించిన కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు, దంప తులు పాల్గొని వేదమంత్రోచ్చారణ నడుమ, సాంప్రదాయ బద్ధంగా సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ పవిత్రమైన సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని, ఇది కేవలం వివాహ వేడుక మాత్రమే కాదని, ధర్మం, న్యాయం, కర్తవ్య నిర్వహణ లాంటి అనేక గొప్ప ఆదర్శలకు ప్రతిరూపమన్నారు. ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పోలీస్ కళ్యాణ మండ పంలో ఏర్పాటు చేసిన సీతారాముల కల్యాణ మహో త్సవంలో సతి సమేతంగా పాల్గొని పోలీస్ అధికారులకు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు శ్రీరామనవమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

కల్లుగీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామానికి చెందిన ఉప్పాల యేసు శనివారం సాయంత్రం కల్లు గీత గీస్తూ ప్రమాదవశాత్తు కింద పడడంతో బంధువులు అవనిగడ్డ ఏరియా

ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి గతంలో ప్రభుత్వం ప్రకటించిన 10 లక్షల రూపాయల నష్టపరిహారం ఉప్పాల యేసు కుటుంబానికి అందజేయాలని డిమాండ్ చేశారు. వీరితోపాటు పులి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-చల్లపల్లి : విశ్రాంత ఉపాధ్యాయులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొక్కిలిగడ్డ మణి ప్రభాకర్‌రావు (75) కన్నుమూశారు. ఆదివారం తీవ్రమైన గుండెపోటు రావడంతో తొలుత స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో అత్యవసర చికిత్సలు అందించి మెరుగైన వైద్యం కోసం విజయవాడ మణిపాల్

ఆసుపత్రికి తరలించగా అక్కడ తుది శ్వాస విడిచారు. ఘంటసాల మండలం చిట్టూర్పు యూపీ పాఠశాలలో సుదీర్ఘ కాలం పాటు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన ఆయన జిల్లా, రాష్ట్ర,జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన మణి ప్రభాకరరావు ఉద్యోగ విరమణ అనంతరం విద్యార్థులకు సహకారం అందిస్తూనే ఉండేవారు. ఎంతోమందికి ఆర్థికంగా సహకరించడం, స్టడీ మెటీరియల్ అందించటం చేస్తూ ఉండేవారు. చల్లపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా పనిచేసి ప్రజలకు సేవలు అందించారు. మణి ప్రభాకర్ రావు భౌతికకాయాన్ని వక్కలగడ్డలోని స్వగృహానికి తీసుకురాగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు. మణి ప్రభాకర్ మతి పట్ల సిపిఎం మండల కమిటీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శీలం నారాయణరావు సంతాపం ప్రకటించారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆర్‌టిఓ కార్యాలయం ఎదురుగా ఉన్న వెంకటేశ్వ రావుకు చెందిన అపార్ట్ మెంట్ 2వ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెంబర్ 202లో

ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది వెంటనే వెళ్లి అగ్ని ప్రమాదం చుట్టుప్రక్కలకు వ్యాపించకుండా వెంటనే నియం త్రించడం వల్ల పెను ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి పడమ రవీధిలోని శ్రీ వెంకట కృష్ణమ్మ రామాలయ అబివృద్ధికి చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని నాని 25వేల రూపాయలు విరాళంగా అందచేశారు. టీడీపీ రాష్ట్ర నాయకులు

కొనకళ్ల బుల్లయ్య, యువనేత మండలి వెంకట్రామ్ ల చేతులమీదుగా ఆలయ కమిటీ పెద్దలకు విరాళం నగదును అందించారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, టీడీపీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, మోర్ల ప్రసాద్, మోర్ల శివ, బళ్ళా వాసు, వేముల హరికష్ణ పాల్గొన్నారు.

పలుచోట్ల చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి : వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీర్చటం సామాజిక బాధ్యత అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథరావు (బుల్లయ్య) అన్నారు. ఆదివారం చల్లపల్లి శ్రీ లక్ష్మీ విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో చల్లపల్లి టాక్సీ ఓనర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. అతిథులుగా కొనకళ్ళ బుల్లయ్య, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద పానకం పంపిణీ చేశారు. చల్లపల్లి టాక్సీ ఓనర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టాక్సీ స్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సత్కరించారు.

అలాగే చల్లపల్లిలో కృష్ణాజిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామ దేవత శ్రీ సంపటాలమ్మ తల్లి ఆలయం వద్ద చల్లపల్లి పోలీస్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని అవనిగడ్డ డీఎస్పీ తాళ్ళూరి విద్యశ్రీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, టాక్సీ యూనియన్ గౌరవ అధ్యక్షులు ముమ్మనేని రాజకుమార్ (నానీ), వైస్ ఎంపీపీ, టీడీపీ మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, సీఐ కే.ఈశ్వరరావు, ఎస్ఐ పీ.ఎస్.వీ సుబ్రహ్మణ్యం, సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, , సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు, **ప్రజాశక్తి - గుడివాడ** : స్థానిక ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్టేడియం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రాన్ని స్టేడియం కమిటీ వైస్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలకు పానకాన్ని కూడ ఆయన పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, కమిటీ సభ్యులు, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

గడివాడలో చలివేంద్రం ప్రారంభిస్తున్న యలవర్తి

చల్లపల్లిలో చలివేంద్రం ప్రారంభిస్తున్న డిఎస్‌పి

వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై శ్రీరామ కళ్యాణం' శ్రీరామనవమిని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై శ్రీ సీతారాముల కళ్యాణం ఆదివారం జరిగింది. రాజగోపురం ప్రాంగణంలోని కళావేదికపై ఉదయం 10 గంటల నుండి కార్యక్రమాలు ప్రారంభించి, ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. యాత్రికులు పాల్గొని కళ్యాణం వీక్షించారు. ఉపాలయం అయిన సీతానగరం శ్రీ మధ్విరాంజనేయ స్వామి దేవస్థానం శ్రీ సీతారామ కళ్యాణం జరిగింది. **వన్‌టౌన్ :** శ్రీరామనవమి సందర్భంగా కొత్తపేటలో శ్రీ నగరాల సీతారామస్వామి వార్ల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఏటా మాదిరిగానే శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో దేవస్థానం కమిటీ కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు – మాధవి దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణ మహోత్సవానికి విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు వై.సుజనా చౌదరి, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి నరేంద్ర దంపతులు, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు పోతిన వెంకట మహేష్, బిజెపి జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ తదితర ప్రముఖులు విచ్చేసి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు (పిసి) తదితరులు అతిథులకు స్వాగతం పలికి సత్కరించారు. రామాలయం చరిత్రను, రథం విశేషాలను అతిథులకు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షులు మరుపిళ్ళ సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి శీరం వెంకటరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు, కమిటీ సభ్యులు పోతిన సాంబశివరావు, పోతిన వెంకట ధర్మారావు, పణుకు రమ, కామందుల నరసింహారావు, పిళ్ళా విజయ్ కుమార్, మజ్జి శ్రీనివాసరావు, మజ్జి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదాన్ని అందజేశారు. **గంపలగూడెం:** ఆదివారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు ఆలయాల్లో సీతారామ కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రధానంగా గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయమునందు 13 మంది దంపతులు పీటలపై కూర్చొని కన్యాదానం చేశారు. పురోహితులు దేవయాన శ్రీధరాచార్యులు, రామాచార్యుల కళ్యాణం నిర్వహించారు. స్థానిక శ్రీరామ భజన మందిరం వద్ద జరిగిన కళ్యాణంలో నలుగురు దంపతులు, షిరిడి సాయి ధ్యాన నిలయంలో ఇద్దరు, మండలా ఫీస్ ఎదురుగా నూతనంగా ఏర్పాటైన శ్రీరాముని కళ్యాణంలో 20 మంది దంపతులు, తోట మూల వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద 10 మంది దంపతులు కన్యాదానం చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమం జరిగింది. **మైలవరం :** సీతారాముల కల్యాణాన్ని మండలంలో పలు గ్రామాలలో ఆదివారం వైభవంగానిర్వహించారు. మైలవరం రామకృష్ణ కాలనీలోని శ్రీరామ భక్తాంజనేయ దేవస్థానంలో సీతారాముల కళ్యాణాన్ని తమ్మిశెట్టి మురళీకృష్ణ విమల త్రివేణి దంపతులు, తాడి సురేష్ బాబు మోహన్ ప్రత్యూష దంపతులు, తమ్మిశెట్టి విజయకాంత్, వారి మాతమూర్తి తమ్మిశెట్టి ధనలక్ష్మి, బయ్యన శ్రీనివాసరావు దంపతులు స్వామివార్లకు మంగళసూత్ర హారాలు, తలంబ్రాలు ఈ సందర్భంగా బహూకరించారు. **తిరువూరు :** శ్రీరామనవమి వేడుకలు తిరువూరు పట్టణంలో, గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తిరువూరు బోసుబొమ్మ ఎస్‌ఐబిఐ ఎటిఎం సెంటర్‌లో ఆప్రాంతం వ్యాపారులు ప్రత్యేక పంది ళ్ళువేసి సీతారాముల కల్యాణం నిర్వహించారు. శ్రీకోదండ రామాలయం, శ్రీదాసాంజనేయస్వామి ఆలయం, రాజుపేట, చీరాల సెంటర్లలోని శ్రీవీ రాంజనేయస్వామి దేవస్థానం, షిర్డిసాయి మంది రం, పాతతిరువూరు రామాలయం, ఆర్యవైశ్య కల్యాణ మంటపాలలో సీతారాముల కల్యాణ మహొూత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు. గ్రామాల్లో కూడా కళ్యాణ మహోత్సవం నిర్వహించి పానకం, పులిహోర ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. **రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండలంలో శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలో పలు దేవాలయాల్లో అన్నదానం నిర్వహించారు. **వత్సవాయి :** మండలంలోని పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, యాత్రికులు పాల్గొని నవమి వేడుకలు దగ్గరుండి తిలకించారు. సీతారామ వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు పిట్లపై కూర్చొని పూజాకార్యక్రమాలు చేపట్టారు. అనంతరం పులిహోర పట్ల పంపిణీ చేశారు. సింగవరంలో అన్నదాన కార్యక్రమం గ్రామ పెద్దల సహకారంతో అందించారు. **జగ్గయ్యపేట :** శ్రీరామ నవమి పండుగ సందర్భంగా మండలంలోని బలుసుపాడు గ్రామంలో శ్రీ గురుధామ్‌లో తాత్వికులు శివ గెంటేల వెంకటరమణ దంపతులు ఆధ్వర్యంలో జరుగుతున్న సీతారాములవారి కళ్యాణానికి ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు దంపతులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామలో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం జరిగాయి. నందిగామ గాంధీ సెంటర్, మెయిన్ బజార్, రామాలయం, శ్రీరామ నగర్, పలు చోట్ల పందిళ్ళు ఏర్పాటు చేశారు. సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అనంతరం ప్రజలకు పానకం, ప్రసాదం పంపిణీ చేశారు. డివిఆర్ కాలనీలో ప్రజలకు ప్రజా సంఘాల నాయకులు అన్నదానం నిర్వహించారు. నందిగామ మాజీ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్‌రావు రామాలయంలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన సీతారాముల కల్యాణోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

మైలవరంలో....

గంపలగూడెంలో...

కొత్తపేటలో (విజయవాడ వన్‌టౌన్)

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ప్రతిరోజు జరుగు అన్నదానానికి హైదరాబాద్ వాస్తవ్యులు దాట్ల సుబ్బరాజు, సీతాలక్ష్మీ అనువారు రూ.35వేలు, చందర్లపాడు మండలం పాతబెల్లంకొండ వారిపాలెం వాస్తవ్యులు తాళ్ళూరి జస్వంత్ రూ.12వేలు, హైదరాబాదు వాస్తవ్యులు ఉప్పలపాటి కార్తికేయ వర్మ రూ.5,116, కాకర్లపూడి జస్వంత్ ఆంజనేయ వర్మ రూ.5,116, కాకర్లపూడి కావ్యకీర్తన రూ.5,116లు నగదు రూపంలో విరాళంగా సమర్పించారని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.లక్ష్మణ ఇందిరాదత్తు, కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.



పంచాయతీకి ఎలక్ట్రికల్ ఆటో బహూకరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని జయంతిపురం గ్రామపంచాయతీ శివారు గ్రామం రావిరాలలో పారిశుధ్యం (తడిచెత్త, పొడిచెత్త) సేకరణ కోసం ఉపయోగించు ఎలక్ట్రికల్ ఆటో (2 లక్షలు 30 వేలు విలువ)ను ఉచితంగా గ్రామపంచాయతీ కార్యదర్శి ఇమామ్‌కు గ్రామస్తుడు, పారిశ్రామికవేత చిరుమామిళ్ల బాలకృష్ణ ప్రసాద్ బహూకరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు బాలకృష్ణ ప్రసాద్‌ను ప్రశంసలు కురిపిస్తూ, అభినందనలు తెలిపారు.

పలు చోట్ల అన్నదానం

ప్రజాశక్తి - కంచికచర్ల : శ్రీరామనవమిని పురస్కరించుకొని కంచికచర్ల పరిసర ప్రాంతాల్లో పలు గ్రామాల్లో సీతారాముల కళ్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాలూలో రామాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చలువ పందిళ్లు వేశారు. మంగళ తోరణాలు కట్టి ఉదయం నుండే మేళతాళాలతో ఉత్సవాలు నిర్వహించారు. నూతనంగా రాతి కట్టడంతో నిర్మించిన రామాలయంలో కల్యాణం నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో కళ్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. నెహ్రు సెంటర్ వద్ద ట్రాక్టర్ల అసోసియేషన్ ట్రాక్టర్ ఓనర్స్ వర్కర్స్ అధ్వర్యంలో సీతారాముల కళ్యాణం, అన్నదానం నిర్వహించారు. వసంత కాలనీ హాస్టల్ బజార్‌లో సీతారాముల కళ్యాణం వేడుకలు ఘనంగా జరిగాయి.

తుప్పు పట్టిన చెత్త సేకరణ ఆటోలు

చెత్త నిల్వతో అధ్వానంగా గ్రామీణ ప్రాంతాలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించి, ఊరు బయట ఉన్న 'చెత్త నుండి సంపద కేంద్రాల'కు తరలించాల్సి ఉంది. కానీ మండలంలో ఉన్న 12 గ్రామ పంచాయతీలు, 11 శివారు గ్రామాల్లో చెత్తను సేకరించే ప్రయత్నం అరకొరగా మాత్రమే సాగుతుంది. రాష్ట్రం విడిపోయి మొదటిగా ఏర్పాటు అయిన నాటి టిడిపి ప్రభుత్వం అన్ని గ్రామాల్లో, ప్రతి వీధిలో చెత్తను సేకరించి, సేకరించిన చెత్త నుంచి సంపద సృష్టించాలనే ఆలోచనతో ఎలక్ట్రికల్ ఆటోలను కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంతలో 2019 ఎన్నికలు రావడం, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత చెత్త సేకరణ ఆటోలు మంజూరు కావడం, అన్ని గ్రామాల్లో చెత్తను సేకరించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇలా అన్ని గ్రామాల్లో కూడా వీధి వీధిన చెత్త సేకరణ ఆటోలు ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించి గ్రామ చివరన ఏర్పాటు చేసిన చెత్త నుండి సంపద కేంద్రాలకు తరలించారు. కొంత కాలానికి పలు రకాల సాకులతో చెత్త సేకరణ ఆటోలను ఆపేశారు. ఎంతో ఖర్చుతో కొనుగోలు చేసిన ఈ ఆటోలు వినియోగంలో లేకుండా తుప్పు పట్టిపోతున్నాయి. ఇలా తుప్పు పట్టి పాడై పోతున్న ఆటోల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త

మండలం ఉన్న అన్ని గ్రామాల్లో కూడా రోడ్లు, గృహాలు, పబ్లిక్ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆ ప్రాంతంలో

తుప్పు పట్టిన ఎలక్ట్రానిక్ ఆటో

మురుగు నిల్వ అయి దోమలు బాగా పెరిగిపోతున్నాయి. చెత్తను సేకరించే వారే కరువయ్యారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఆవాస ప్రాంతాల్లో ఈ చెత్త బాగా పేరుకు పోతుంది. ఇటీవల కాలంలో రెడ్డిగూడెం మండల కేంద్రంలో మాత్రం మెయిన్ విలేజ్ లో ఒక వాహనం ద్వారా చెత్తను సేకరించే పనిలో పడ్డారు.

ఎస్సీ, ఎస్టీ ఏరియాలో చెత్తను సేకరించాలి : కెవిపిఎస్

మండలంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే చెత్తను తొలగించి, మిగిలిన ప్రాంతాల్లో చెత్తను సేకరించకపోవడం వివక్షకు గురవుతున్నట్లేనని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కన్వీనర్ సిహెచ్ విజయకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల ఉన్న అన్ని ఎస్సీ ఎస్టీ ఏరియాలో కూడా చెత్తను సేకరించేందుకు గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామాల్లో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ప్రతి రోజూ చెత్తను సేకరిస్తున్నారనీ, మిగతా గ్రామంలో ఉన్న వారు కూడా మనుషులేనని కనుక అధికారులు వివక్ష చూపడం సరికాదన్నారు.

రెడ్డిగూడెం ఎస్సీవాడలో రహదారి పక్కన ఉన్న చెత్త

ధాన్యం రైతు దిగాలు

- కొనుగోలు కేంద్రాలు మూసేసిన ప్రభుత్వం
- ధాన్యం అమ్ముడుపోక ఇబ్బందులు

ప్రజాశక్తి-గన్నవరం : ఆరురుగాలం శ్రమించి పండించిన ధాన్యం పంట నోటి దగ్గరకు వచ్చే సమయంలో కొనుగోళ్లు ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కమిషన్ వ్యాపారులు తక్కువగా అడుగుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు మూసేసింది. ఆలస్యంగా కుప్పలు నూర్చిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీనికి తోడు వాతావరణంలో మార్పులు రావడంతో పాటు గన్నవరం ప్రాంతాల్లో జల్లులు కురవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతు న్నారు. విరగపండిన పంటను చూసి సంతోష పడిన రైతులు ప్రస్తుతం దిగులు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఇలాగే పంట చేతికొచ్చే సమయంలో నష్టపోవడం చూసి ప్రకతి ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా రెండు రోజుల పాటు ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావ రణశాఖ హెచ్చరికలతో పంటను ఎలా దాయాలో తెలియడం లేదని అంటున్నారు . కుప్పలు ఎక్కువ రోజులు ఉంటే రంగు మారే అవకాశం ఉండ డంతో విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నూర్చిన పంట విక్రయాలు కాలేదు. జల్లులు పడటంతో కొంత మంది రైతులు ధాన్యాన్ని ఆరబెట్టగా మరికొందరు బస్తాల్లోకి ఎత్తి ఉంచారు. వర్షాలు ఎక్కువైతే పంట ఏమవుతుందోనని కంగారుపడుతున్నారు. మర్లపాలెం, బీబీగూడెం, కొండపావులూరు, పట్నం, గోపవరపుగూడెం, సూరంపల్లి ఇలా అన్నిచోట్ల ధాన్యం బస్తాల నిల్వలు ఉన్నాయి. వానలు ఎక్కువ అయితే ధాన్యం తడిసి నష్టం కలుగుతుంది. మినుముకు నష్టం కలుగుతుంది. దీంతో పాటు కేజీ రూ.120కు పైగా వెచ్చించి మినుములు కొనుగోలు చేసి ఎకరానికి 25 నుంచి 30 కేజీల విత్తనాలు చల్లారు. ఇలా రైతులు రెండు విధాలుగా నష్టపోవాల్సి వస్తుంది. ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం మరియు శ్రీ రామ నవమి పర్వదినం సందర్భంగా అమ్మవారిని సుమారు ఐదు వేలమంది భక్తులు దర్శించుకున్నారు. అత్యధిక స్థాయిలో భక్తులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కు బడులు తీర్చుకున్నారు. శ్రీ అమ్మవారి దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు ఏ విధమైన అసౌకర్య ములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వ హణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి కుమారుడు అనుదీప్, కూటమి నాయకులు, కష్ణా జిల్లా, దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి ఎన్ వి.సాంబశివరావు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు వారిని శేషవస్త్రములతో సత్కరించి, తీర్ధ ప్రసాదములు అందజేశారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు .జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం కార్యక్రమం జరుగుతుందని, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించు కోవచ్చునన్నారు.

నూతన వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం సూరంపల్లి గ్రామంలో రామాలయం లో సీతారామ స్వామి కళ్యాణ మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. తోట వెంకయ్య దంపతులు కళ్యాణంలో కూర్చున్న వారికి నూతన వస్త్రాలు బహూకరించారు. గత 22 సంవత్సరాలుగా ఈ సంప్రదాయం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. సాంప్రదాయ ప్రకారం స్వామివారికి పట్టు వస్త్రాలను పెద్దలు సమర్పించి పీటల మీద కూర్చుని కళ్యాణం నెరవేర్చారు. ఈ కళ్యాణ మహెూత్సవంలో అన్నదాన కార్యక్రమం జరిపారు. గన్నవరం ఆగిరిపల్లి రోడ్డులో సాంబశివ జనరల్ స్టోర్ నిర్వహకులు శంకర్ ఆధ్వర్యంలో కళ్యాణం జరిగింది.1200 మందికి అన్నదానం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రం బుట్టాయిపేటలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి రోగులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ప్రతి రెండు నెలలకు ఓసారి మొదటి ఆదివారం నిర్వహించే శిబిరంలో రక్త పోటు షుగర్ ఫిట్స్ పక్షవాతం రోగులకు ప్రముఖ వైద్యులు రోగులను పరీక్షించి రెండు నెలలకు సరిపడా మందులు ఉచితంగా ఇస్తామని హెల్త్ క్యాంప్ కన్వీనర్ పామర్తి నాగయ్య తెలియజేశారు. న్యూరాలజీ విభాగంలో ప్రముఖ వైద్యులు గోపాలం శ్రీమన్నారాయణ జనరల్ మెడిసిన్ లో చల్లపల్లి నుంచి డిఆర్కె ప్రసాద్ తదితరులు శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించారు. దాదాపు 300 మంది ప్రజలు ఈ వైద్య శిబిరానికి విచ్చేసి ఆరోగ్య సేవలు పొందారు. ఈ వైద్య శిబిరం నిర్వహణలో మహమ్మద్ యూనస్ , జోజి బాబు, మెండు శ్రీరాములు, పి శ్రీధర్ మాలతి, చంద్రపాల్, ప్రసాద్ తదితరులు వాలంటీర్లుగా సేవలందించారు.

ఐదేళ్లగా మందులు తీసుకుంటున్నాను

గోరుపర్తి రామస్వామి, గొల్లపాలెం

రెండు నెలలకు ఓసారి మొదటి ఆదివారం నిర్వహించే క్యాంపు బందరు పరిసర గ్రామాల ప్రజలకు అపర సంజీవనీగా మారింది. తాను ఐదేళ్ల నుంచి రెగ్యులర్గా ఈ శిబిరానికి వచ్చి మందులు వాడి పూర్తి ఆరోగ్యంగా ఉన్నాను. వ్యవసాయం, గొర్రెలమంద పోషణ పనులు చురుగ్గా చేసుకోగలుగుతున్నా.

విరాళం అందజేస్తున్న యార్లగడ్డ శివప్రసాద్

'మనకోసం మనం ట్రస్ట్'కు విరాళం

ప్రజాశక్తి-చల్లపల్లి : స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనకు అభివద్ధి, సుందరీ పనులు చేస్తున్న మనకోసం మన ట్రస్ట్‌కు దాతలు విరాళాలను అందజేశారు. ఆదివారం 34 35వ రోజు స్వచ్ఛ సేవలో పాల్గొన్న స్వచ్ఛ సారధి, ట్రస్ట్ మేనేజ్ ట్రస్టీ డాక్టర్ డిఆర్ కె ప్రసాద్ కు విద్యావేత్త యార్లగడ్డ శివప్రసాద్ 25వేల రూపాయలు విరాళాన్ని, స్వచ్ఛ కార్యకర్త ప్రాతూరి ఉదయ శంకర శాస్త్రి ఐదువేల రూపాయల విరాళాన్ని అందించారు. స్వచ్ఛ కార్యకర్తలు తరపున దాతలకు డిఆర్ కె కతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ ఆదివారం స్వచ్ఛ సేవలో పాల్గొన్నారు. డి ఆర్ కె దంపతుల నేతత్వంలో విరామం లేకుండా పూర్తివంతంగా సాగుతున్న స్వచ్ఛ ఉద్యమం స్వచ్ఛత కోసం పాటుపడుతున్న స్వచ్ఛ కార్యకర్తలను ఆయన అభినందించారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-కోడూరు : పర్ణశాల ప్రార్ధనా మందిరము (ఘంటసాల) వారి ఆధ్వర్యంలో కోడూరు మండలం దింటిమెరక గ్రామంలోని సర్వశక్తుని ప్రార్ధనామందిరం ఆవరణలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. గుడ్ ఫ్రై డే, ఈస్టర్ పర్వదినాల సందర్భంగా ప్రజలకు ఉచిత ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మచిలీపట్నంకు చెందిన వైద్యులు డాక్టర్ యక్కటి ప్రవళిక బీపీ, షుగర్, జలుబు, దగ్గు, ఆస్తమా, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి, దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు జరిపారు. ఈ వైద్య శిబిరంలో 122 మంది రోగులకు వైద్య సేవలో అందించి 25 వేల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. ఫాస్టర్ పిఎన్.రాజు, వెంకటరత్నం, కిరణ్, సుకన్య, బిందు, చంద్రశేఖర్, ప్రదీప్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలుస్తామని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. మోపిదేవిలో ఇటీవల ప్రధాన రహదారి పక్కన జరిగిన అగ్ని ప్రమాదంలో నిరుపేదలు మోర్ల సీతా మహాలక్ష్మి, పెంద్ర మురిసిరి, సింగోతు రంగారావు, రాజులపాటి రాజేశ్వరి కుటుంబాలు నివ సించే పూరిళ్ళు పూర్తిగా కాలిపోయాయి. బాధిత కుటుంబాల వారు కట్టుబట్టలతో నిలవగా వారిని ఆదివారం సాయంత్రం మండలి వెంకట్రామ్ పరామర్శించారు. ఈ సందర్భంగా తమ గ్రామీణ యువజన వికాస సమితి తరపున బాధితులకు నూతన వస్త్రాలు, చీరలు, దుప్పట్లు అందచేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షులుకొల్లి చక్రపాణి జ్ఞాపకార్ధం వారి కుమారుడు కొల్లి మురళీ, మోపిదేవి ఉప సర్పంచ్ కోనేరు సుందర్ సింగ్, టీడీపీ నేత పరుచూరి శ్రీనివాసరావులు కలిసి ఒక్కో కుటుంబానికి రూ.2,500 చొప్పున ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, రైస్ కట్టలు మండలి వెంకట్రామ్ చేతులమీదుగా అందచేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో హెవీ టార్పాలిన్లు, హైజినిక్ కిట్స్, వంట పాత్రలను వెంకట్రామ్ చేతులమీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్ బ్రాంచ్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షులు రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, జనసేన మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్ పాల్గొన్నారు.

అశోక చక్రవర్తి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బుద్ధుడు విగ్రహాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

అశోక చక్రవర్తి జయంతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో చెరువు బజార్ వద్ద గల బుద్ధ విహార్‌లో ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గౌతమ బుద్ధ ధ్యాన కేంద్రం – జగ్గయ్యపేట వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అశోక్ చక్రవర్తి 3 జయంతి కార్యక్రమంలో శనివారం రాత్రి ముఖ్య అతిథులుగా జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం, ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొని అశోక చక్రవర్తి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బుద్ధుడు విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్దలు రఘురామ్, తాతయ్య మాట్లాడుతూ తన బోధనలకు, తన పనికి విస్తృత ప్రచారం పొందడానికి, అశోకుడు వాటిని మౌఖిక ప్రకటనల ద్వారా, తగిన ప్రదేశాలలో రాళ్ళు, స్తంభాలపై చెక్కడం ద్వారా తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధిస్ట్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు హరిబాబు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గింజుపల్లి రమేష్, న్యాయవాది పసుపులేటి సత్య శ్రీనివాస్, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరంలో అక్రమ భవన నిర్మాణాలు జరుగుతున్న పట్టించుకునే అధికారి కరువయ్యాడు. సిఆర్‌డిఏ రూటే సపరేటు అన్న మాట వినిపిస్తుంది. ప్రస్తుతం 50 కి పైగా అపార్ట్మెంట్ నిర్మాణం జరుగుతోంది. ఇందులో అధిక శాతం అపార్ట్మెంట్లకు సి ఆర్ డిఏనుంచి పూర్తిస్థాయిలో అనుమతులు లేవని తెలుస్తోంది. తూతూ మంత్రంగా అనుమ తులు తీసుకొని, హడావుడిగా అపార్ట్మెంట్ నిర్మాణం చేపట్టి, వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అపార్ట్మెంట్ల నిర్మాణంలో సిఆర్డిఏ అధికారులను సైతం బురిడీ కొట్టించి నిర్మాణాలు సాగిస్తున్నారు. గన్నవరం విద్యా నగర్లో ఇదే మాదిరిగా ఒక అపార్ట్మెంట్ నిర్మా ణం జరిగింది. జి ప్లస్ టు కి అనుమతి తీసు కొని 8 అంతస్తులు నిర్మించారు. 24 అడు గులు ఉన్న రహదారిని 30 అడుగులుగా చూపించి అధికారులను మాయ చేశారు. ఇదే మాదిరిగా జాతీయ రహదారికి

సిఆర్‌డిఏ రూటే సెపరేటు

అనుకుని ఇటీ వల నిర్మించిన మూడంతస్తుల భవనానికి సి ఆర్ డి అనుమతులు లేవు. మరో భవన యజ మాని సెలవు దినాల్లో, అర్ధరాత్రి వేళల్లో మూడంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఏ అపార్ట్మెంట్ చూసినా సి ఆర్ డి ఏ నిబంధనలను గాలికి వదిలేసినట్లే కనిపిస్తుం ది. రహదారులు సరిగ్గా లేకపోవడం, నిర్మిం చిన అన్ని అంతస్తులకు అనుమతులు లేకపోవటం, పచ్చదనాన్ని పట్టించుకోకపోవ డం. సి ఆర్ డి ఎ అనుమతులను పూర్తిస్థాయి లో పాటించకపోవడం కనిపిస్తున్నాయి.

గన్నవరం ప్రాంతంలో సీఆర్డీఏ నిబంధ నలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్న అపార్ట్మెంట్లకు

పంచాయతీ అధికారి నుంచి పూర్తి సహకారం అందుతుందని విమర్శలు ఉన్నాయి. అనుమతుల సమయంలోనే పంచాయతీ కార్యదర్శిని ప్రసన్నం చేసుకొని యజమానులు అక్రమ నిర్మాణాలకు తెరతీసి నట్లు తెలుస్తోంది. సి ఆర్ డి ఏ నిబంధన ప్రకారం 30 అడుగుల రోడ్డు ఉండాల్సి ఉంది కానీ 15.. 20 అడుగులు ఉన్నా అనుమతులు ఎలా లభిస్తున్నాయి అనేది ప్రశ్నార్ధకంగా ఉంది.

పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం ?

గన్నవరం ప్రాంతంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సి ఆర్ డి ఏ అధికారులు దష్టి పెట్టిన దాఖలాలు లేవు. అపార్ట్మెంట్లకు అనుమతులు ఇచ్చే సమయంలోను సి ఆర్ డి అధికారులు నిబంధనలను తుంగలో తొక్కు తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఏ ప్రాంతం లో అపార్ట్మెంట్ నిర్మాణం జరుగుతుంది. స్థానిక వాతావరణం అనుకూలంగా ఉండా లేదా, రహదారులు నిబంధన ప్రకారం ఉన్నా యా లేవా అన్న వేమి అధికారులు పట్టించు కోవడం లేదు. బిల్డర్ల దగ్గర నుంచి సొమ్ము వసూలు చేసి అనుమతులు చేస్తున్నారని ఆరో పణలు ఉన్నాయి. అనుమతి ఇచ్చిన తర్వాత నిర్మాణ సమయంలో ఏ ఒక్క అధికారి ఒక్క అపార్ట్మెంట్ అయినా సందర్శించిన దాఖ లాలు లేవు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా తనిఖీలు చేసి జేబులు నింపుకొని వెళ్లిపోతున్నారు. అపార్ట్మెంట్ల అక్రమ నిర్మా ణాలపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ప్రజల నుంచి విన్నపాలు అవుతున్నాయి. జిల్లా అధికారుల చర్యలు ఏ విధంగా ఉంటాయో చూడాలి.

వీనుల విందుగా నాటికలు

- యడ్లపాడులో ముగిసిన సుందరయ్య కళానిలయం నాటిక పోటీలు
- మూడ్రోజులపాటు కోలాహలంగా ప్రదర్శనలకు తరలివచ్చిన ప్రేక్షకులు

సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు కుటుంబం

ప్రజాశక్తి - యడ్లపాడు

పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన యడ్లపాడులో మూడ్రోజులపాటు నిర్వహించిన 22వ జాతీయ స్థాయి నాటి పోటీలు ఆదివారం ముగిశాయి. సందేశాత్మక ఇతివృత్తాలతో ప్రదర్శి ంచిన నాటికలు ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపేడేశాయి. సమాజాన్ని పట్టిపీడిస్తున్న అంశాలను కథాంశాలుగా ఎంచుకుని నాటికలను దర్శకులు తీర్చిదిద్దగా దానికి అనుగుణంగానే కళాకారులు పోటీపడిమరీ నటించి ప్రదర్శనలను రక్తి కట్టించారు. ప్రదర్శనలను వీక్షించేందుకు స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రేక్షకులు తరలిరాగా ఏర్పాట్లను వేదిక (తెలుగు నాటక రంగం సమ్మేళనం) అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు దంపతులు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. సుందరయ్య కళానిలయం బాధ్యులు ఎం.రామారావు, జె.శంకరరావు, షేక్ ఖాజా, ఎన్.మాధవరావు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో బహుమతులు ప్రదానం చేశారు.

జనరల్‌బోగిలు

ప్రదర్శనల్లో భాగంగా రెండోరోజైన శనివారం రాత్రి మొదటి ప్రదర్శనగా పిటి మాధవ్ రచించిన 'జనరల్ బోగీలు' నాటికను గోపరాజు విజయ్ దర్శకత్వంలో శ్రీసాయి ఆర్ట్స్ (కొలకలూరి) వారు ప్రదర్శించారు… సావిత్రమ్మ కుమారుడు జనరల్ బోగీలో ప్రయాణిస్తుండగా జరిగిన రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతాడు. కానీ జనరల్ టికెట్ కావడంతో అతడి వివరాలు రైల్వే వద్ద ఉండవు. మృతదేహాన్ని గుర్తించలేని ఆమె ఎదురు చూస్తూ నిరవధిక బాధలో కూరుకుపోతుంది. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ ఆమె ఉత్తరాల ఉద్యమాన్ని ప్రారంభిస్తుంది. ప్రజాప్రతినిధులకు, అధికారులకు వరుసగా ఉత్తరాలు రాస్తూ పోరాడుతుంది. ఆమె పోరాటం కొంతమందికి అసౌకర్యంగా మారి, ఆమెపై కుట్రలు జరుగుతాయి. చివరికి ఆమెను అరెస్టు చేస్తారు, అయినా ఆమె ఆత్మబలాన్ని చెరపలేరు. జైలులోనూ ఆమె ఉద్యమ గళం ఆగదు. ఆమె తీర్పుల కీటకాలుగా మారి సామాన్య ప్రజల్లో చైతన్యం నింపుతుంది. చివరికి జనరల్ బోగీలలో ప్రయాణికుల వివరాల నమోదుపై దేశవ్యాప్తంగా చర్చ మొదలవుతుంది..

నా శత్రువు...

రెండో ప్రదర్శనగా అక్కల తామేశ్వరయ్య రచించిన 'నా శత్రువు' నాటికను వడ్డాది సత్యనారాయణ దర్శకత్వంలో జయభేరీ థియేటర్స్ హైదరాబాద్ వారు ప్రదర్శించారు… ప్రస్తుత కాలంలో మనిషి మనుగడ సాంకేతికంతో ముడి పడిపోయింది సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, సోషల్ మీడియాతో గంటలకు గంటలు గడుపుతున్నారు. బంధాలకు, అనుబంధాలకు దూరమై ఎవరికి వారు ఒంటరిగా మిగిలిపోతున్నారు. టెక్నాలజీ అవసరానికి మాత్రమే వాడితే దానికి మించిన మంచి మిత్రుడు మరొకరు ఉండరు. అవసరానికి మించితేనే జీవితంలో ఊహించని ప్రమాదాలు సంభవిస్తాయని.. అనే సందేశంతో నాటిక సాగింది.

ఋతువు లేనికాలం...

మూడో ప్రదర్శనగా శ్రీ అగస్త్య రచించిన 'ఋతువు లేనికాలం' నాటికను వైవి చౌదరి దర్శకత్వంలో కళానికేతన్ వీరన్నపాలెం వారు గోరంట్ల సురేంద్ర నిర్వహణలో ప్రద ర్శించారు… ప్రస్తుత కాలంలో ఆడపిల్లలకు భర్త కావాలి. అతనికి తల్లిదండ్రులు, తోబుట్టువులు అక్కర్లేదు. అలాంటి వారు దొరికేవరకు పెళ్లి కూడా చేసుకోవడం లేదు. వీరి దృష్టిలో అత్త ఓ శత్రువు, ఆడబిడ్డలు రాక్షసులు, స్వీకరణే తప్ప తిరిగిఇచ్చే ఆలోచన లేని వ్యక్తిత్వం. వీరికి వస్తువుపై వ్యామోహం తప్ప జీవితంపై ప్రేమ లేదు. విలాసాలు, ఫ్యాషన్లకు బానిసలై భర్త, పిల్లలకు దూరమై ఒంటరి జీవితాలను గడుపుతున్నారు. అలాంటి వారికి కుటుంబ బంధాల విలువల్ని తెలియజేసేదే ఈ నాటిక సారాంశం.

గురితప్పిన వేట...

రెండోవ రోజు నాలుగో ప్రదర్శనగా పి.మృత్యుంజయరావు రచించిన 'గురితప్పిన వేట' నాటికను వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో రసఝరి పొన్నూరు వారు ప్రదర్శించారు… ఒక నైతిక సందేశాన్ని నాటకీయంగా మలిచిన ఈ నాటిక అడ్డదారులను ఆశ్రయించిన ఓ యువకుడి ప్రయత్నాన్ని ఎలా అడ్డుకుంది అనే విషయాన్ని ఆసక్తిదాక సంఘటనలతో ప్రదర్శించారు.

నాన్న నేనొచ్చేస్తా...

చివరిరోజైన ఆదివారం మొదటి ప్రదర్శనగా తాకబత్తుల వెంకటేశ్వరరావు రచించిన 'నాన్న నేనొచ్చేస్తా' నాటికను అమృత లహరి దర్శకత్వంలో అమృత లహరి థియేటర్స్ (గుంటూరు) వారు ప్రదర్శించారు… తల్లిదండ్రులు తమ పిల్లలపై చూపించే అపారమైన ప్రేమ, మితిమీరిన వాత్సల్యం అనేక సందర్భాల్లో పిల్లల భవిష్యత్తుపై దుష్ప్రభావం చూపుతోందని తెలియజేసే కళారూపమే ఈ నాటిక. ఆడపిల్లల విషయంలో తల్లిదం డ్రులు ప్రత్యేకంగా 'మన కూతురు బాగుండాలి' అనే ప్రేమ తో, పెళ్లికి ముందు పూర్తిస్థాయిలో స్వేచ్ఛనిచ్చి పెంచు తారు. అయితే

వివాహానంతరం వచ్చిన మనస్పర్ధలను తట్టుకోలేక, మానసిక స్థైర్యం లేని పరిస్థితి ఉత్పన్నమవు తుంది. చిన్న చిన్న విభేదాలకే పెద్ద సమస్యలా భావించి, 'నాన్న, నేను వచ్చేస్తున్నా' అనే మాటతో పుట్టినింటి బాట పడుతారని హెచ్చరిస్తూ నాటిక ప్రదర్శన ముగిసింది.

బ్రహ్మస్వరూపం...

ఆదివారం రెండో ప్రదర్శనగా శ్రీస్నిగ్ధ రచించిన 'బ్రహ్మస్వరూపం' నాటికను టివి పురుషోత్తం దర్శకత్వంలో మైత్రి కళానిలయం (విజయవాడ) వారు ప్రదర్శించారు… ప్రశాంతమైన జీవితంలోకి ఊహించని కష్టాలు ప్రవేశించి, ప్రతికూల శక్తుల రూపంలో విఘాతం కలిగిస్తాయి. ఆ క్షణాల్లో మనం నిరాశతో తారాడుతుండగా, విధి భయంకరమైన పరీక్షగా మారుతందని చాటిచెప్పే నాటిక 'బ్రహ్మస్వరూపం'. విషమ పరిస్థితుల్లోనూ ధర్మాన్ని నిలబెట్టేందుకు బ్రహ్మస్వరూపమే ప్రత్యక్షమై తుది న్యాయాన్ని ప్రసాదిస్తాడు. అందుకే స్వచ్ఛమైన దృష్టితో చూసినప్పుడు, మనసుకు నచ్చిన జీవితం మన కళ్లముందే సాకారమవుతుందని తెలియజేసే ప్రదర్శన ఇది.

బావా ఎప్పుడు వచ్చితివి...

ప్రత్యేక ప్రదర్శనగా పివి భవాని ప్రసాద్ రచించిన 'బావా ఎప్పుడు వచ్చితివి' నాటికను జరుగుల రామారావు దర్శకత్వంలో యడ్లపాడు మానవత వారు ప్రదర్శిం చారు… కుటుంబ వ్యవస్థలో అమ్మానాన్న, అక్కాచెల్లి, అత్తాబావ అనే పిలుపుతో బంధాలు బలపడతాయి. కానీ వరసలు కలుపుతూ పిలిచే పిలుపుల వల్ల అమాయకపు భార్య, అపోహలు, అభద్రతా భావం కలిగిన భర్త మధ్య కొన్ని విచిత్ర సంఘటనల్నీ కడుపుబ్బ నవ్విస్తూ, సున్నితంగా కనువిప్పు కలిగించే నాటిక ఇది.

అభివృద్ధిలో దాతల సహకారం అవసరం

ప్రజాశక్తి-గన్నవరం : అభివృద్ధిలో దాతల సహకారం అవసరమని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీఆర్. కిషోర్ తెలిపారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణం అభివద్ధికి రూ. 50 వేలు చొప్పున విరాళాలు ఇచ్చిన విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ టీఎస్ఆర్కె. ప్రసాద్, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షులు కంభంపాటి సూర్యచం ద్రరావును ఆదివారం వాకర్స్ ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వాకర్స్, దాతల సహకారంతో క్రీడా ప్రాంగణాన్ని, వాకింగ్ ట్రాక్ను పూర్తిస్థాయిలో అభివద్ధి చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా ఓపెన్ జీమ్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. నూతనంగా బోర్వెల్ను ఏర్పాటు చేయడంతో పాటు టాయిలెట్స్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. తరుచుగా మెడికల్ క్యాంప్లను నిర్వహిస్తూ వాకర్స్కు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్లో మరిన్ని అభివద్ధి, సేవా కార్యక్రమాల నిర్వాహణకు దాతలు తమవంతు సహకారం అందించాలని కోరారు. గన్నవరం, గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్స్ హెచ్ఎంలు జీఎస్. రవిబాబు, కెఎస్. జగదీశ్వరరావు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు తిరివీధి వెంకయ్య, సభ్యులు చిమట రామారావు, చిల్లపల్లి శ్రీనివాసరావు, బ్రహ్మారెడ్డి, వీసం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

దాతలను సన్మానిస్తున్న వాకర్లు

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

బిసి సమరభేరి గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-కంకిపాడు : బిసిలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఈనెల 11వ తేదీన రాష్ట్రంలో అన్ని జిల్లా కలెక్టరేట్లు వద్ద నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు కోరారు. మహాత్మాజ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా బిసి సమరభేరి పేరుతో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంకిపాడులోని సిపిఎం కార్యాలయంలో బిసి సమరభేరి గోడపోస్టర్ను ఆదివారం ఆవిష్కరించారు. కృష్ణా జిల్లా అధ్యక్షులు గుంటూరు నాగేశ్వరరావు, పెనమలూరు నియోజకవర్గ బిఎస్పి ఇన్చార్జి గుదే జయప్రకాష్, పెనమలూరు నియోజకవర్గం అధ్యక్షులు పైయర్థ ఆశీర్వాదం పాల్గొన్నారు.

రెడ్క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇండియన్ రెడ్ డ్రెస్ సొసైటీ ఆధ్వర్యంలో అవనిగడ్డ పోలీస్ స్టేషన్ ఎదురుగా గల వనజ మెస్ నిర్వాహకులు ఆళ్ళ శ్రీనివాస్ సౌజన్యంతో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. అవనిగడ్డ డిఎస్పి టి విద్యాశ్రీ చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించి శ్రీరామనవమి సందర్భంగా ప్రజలకు పానకం తాగునీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. అదేవిధంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం ప్రకతి వైపరీత్యాల కారణంగా సర్వం కోల్పోయిన బాధితులకు గహోపక రణాలు అందించడం మహిళా దినోత్సవం అలాంటి కార్యక్రమాలు రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ అవనిగడ్డ బ్రాంచ్ చైర్మన్ గుడివాక శేషుబాబు, ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి వీర కుమారి, జిల్లా కమిటీ సభ్యులు వంగర శాస్త్రి రావాలతోపాటు సొసైటీ శాశ్వత సభ్యులు బోగాది సుబ్రహ్మణ్యం, కొండవీటి ఈశ్వరరావు, యాసం చిట్టిబాబు పాల్గొన్నారు

పానకం, మంచినీళ్లు అందజేస్తున్న డిఎస్పి విద్యా శ్రీ

ఉచిత మధుమేహ వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ వ్యాధి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ గవేర్నేని రజిని 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్, క్లబ్ సభ్యులు పెరుమాళ్ళు, పరంధామయ్య, రామకృష్ణ, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

లంకమ్మ వార్షిక మహోత్సవ జాతర ప్రారంభం



ప్రజాశక్తిలి-అవనిగడ్డ : అవనిగడ్డ లో వేంచేసి ఉన్న శ్రీ లంకమ్మ అమ్మవారి వార్షికోత్సవ మహోత్సవ జాతర ఆదివారం ప్రారంభమైంది. ఉదయం 11:45 నిమిషాలకు గ్రామోత్సవం ప్రారంభించగా ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విజయలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. దేవాదాయ శాఖ ఈవో యార్లగడ్డ వాసు వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈ నెల 12వ తేదీ జరిగే అమ్మవారి ఉత్సవం పోస్టర్లను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎడ్ల బండి పై అమ్మవారి విగ్రహాన్ని ఉంచి బ్రహ్మోత్సవా నికి తరలించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 12వ తేదీ శనివారం 11 గంటల 48 నిమిషాలకు గుడికి చేరుకుంటుందని అనంతరం గుడి సంబరం జరుగుతుందని ఈవో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ జాతర మహోత్సవం జరుగుతుందని చెప్పారు.

ఎండుతున్న చెరువులు

- మూగజీవాలకు నీటి ఇక్కట్లు

ప్రజాశక్తి-గన్నవరం : వేసవికాలం కావడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో చెరువులు ఎండుతున్నాయి. మూగజీవాలు దాహార్తితో అల్లాడే పరిస్థితి వస్తోంది. తెంపల్లి, వీరపనేని గూడెం, చిక్కవరం, కొత్తగూడెం, గోపవరపు గూడెం, కొండపావులూరు తదితర గ్రామాల్లో చెరువులు నీరు తగ్గిపోతుంది. ఎండలు ముదిరే సమయానికి చుక్క నీరు కూడా ఉండని పరిస్థితి వస్తోంది. ఈ గ్రామాల్లో 5వేల గేదెలు, 6వేలు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వేసవిలో ఫలానికి మేతకు వెళ్లిన మూగజీవాలకు చెరువుల్లో నీరు ఆధారంగా ఉంటుంది. నీరు లేకపోతే దాహార్తితో అల్లాడి పోతాయని పోషకులు చెబుతున్నారు. ఈ గ్రామాల్లో చెరువులను నింపేందుకు పోలవరం కాలవే ఆధారంగా ఉంది. అయితే దానిలో నీరు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఉన్న నీటిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం కనిపిస్తుంది. కొంతమంది చేపల పేరుతో నీటిని బయటకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరి కొంతమంది వేసవిలో చెరువులు తవ్వాలని సాకుగా చూపించి నీరు లేకుండా చేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలో మూగజీవాల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని పశుపోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఒక చెరువులో పూర్తిగా నీరు ఉండేలా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఏదేమైనా ఈసారి మూగజీవాలకు తాగునీటి ఎద్దడి తప్పేలా కనిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో తొట్టెలు ఏర్పాటు చేసి బోర్ల ద్వారా నీరు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రంగారావుకు అభినందనలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీగా నియమితులైన చెన్ను రంగారావు ఆదివారం మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబును ఆయన కార్యాలయం వద్ద కలిశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు రంగారావును అభినందించి పార్టీ అధినేత నిర్ణయాలకు కట్టుబడి పార్టీ పురోగతికి కృషి చేయాలని సూచించారు. ఆయనతోపాటు నాగాయలంక వైఎస్ఆర్సిపి నాయకులు తోట సాయిబాబు, మద్దికొండలు చిట్టా బాల పాపారావు, బందెల నాగబాబు పాల్గొనగా పార్టీ నమ్మకాన్ని కొమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని రంగారావు హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుని వినూత్న ప్రచారం

ప్రజాశక్తి-దుగ్గిరాల : ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లల్ని చేర్పించమని చుండూరు మండలం వేటపాలెం గ్రామం జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య వినూత్న ప్రచారాన్ని చేపట్టారు. బడిబాట కార్యక్ర మంలో భాగంగా అందరికీ విద్య అందరికీ బాధ్యత అనే ప్రచారం లో భాగంగా ఆదివారం దుగ్గిరా లలో ప్రచారం నిర్వహించారు.ప్రభుత్వ పాఠశాలలలో అర్హత గల ఉపాధ్యాయులు ఉంటారని అమ్మకు వందనం లాంటి ప్రభుత్వ పథకాలు స్కాలర్షిప్లు అందుతాయని మధ్యాహ్నం భోజన పథకం అమలు జరుగుతుందని తమ ద్విచక్ర వాహనానికి మైకు పెట్టి ప్రచారం సాగిస్తున్నారు. బాపట్ల తెనాలి గుంటూరు డివిజన్లో మార్చి 15 న ప్రారంభించాడని జూన్ 15వ తేదీ వరకు ఈ ప్రచారం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

ఎనిమిదో అంతస్తు నుండి పడి ఒకరు మృతి

ప్రజాశక్తి- తాడేపల్లి : స్థానిక పాతూరు రోడ్డులోని అపర్ణ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్ మెంట్లో నివసిస్తున్న పాటిబండ్ల సదాశివరావు (54) ఆదివారం టెర్రస్మీద నుండి కిందకు పడిపోయి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుళ్లూరు మండలం వెంకటపాలెంకు చెందిన పాటిబండ్ల సదాశివరావు అపర్ణగేటెడ్ అపార్టుమెంట్లో ప్లాట్ కొనుక్కుని భార్యతో ఉంటున్నారు. ఆయనకు బిపి, కళ్లు తిరగడం లాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, ప్రతి రోజూ ఆపార్టుమెంట్ టెర్రస్ పైన వ్యాయా మాలు చేస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం వాకింగ్, జాగింగ్చేసే క్రమంలో ప్రమాదవశాత్తు పై నుండి కిందకు పడిపోయారని తెలిపారు. గమనించిన వెంటనే సదాశివరావును 104 ద్వారా ఎయిమ్స్కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్ట్మార్టం అనంతరం సదాశివరావు భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మఅతుడికి భార్య ఇద్దరు పిల్లలు, కుమారుడు అమెరికాలో ఉంటారు. కుమార్తె తల్లిదండ్రులతో కలిసి ఉంటుంది.

టిటి యార్డు కార్మికుడు కన్నుమూత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన వడ్డేశ్వరం సుబ్బారావు (59) శనివారం సాయంత్రం గుండె సంబంధమైన వ్యాధితో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుబ్బారావు తండ్రి వడ్డేశ్వరం బిక్షాలు సిపిఎం పార్టీ సభ్యుడుగాను, గ్రామ సర్పంచిగాను గ్రామంలో సేవలందించారు. బిక్షాలుకు నలుగురు కొడుకులలో పెద్ద కుమారుడు అయిన సుబ్బారావు అనారోగ్యం తో మఅతి చెందారు. 30 సంవత్సరాలకు పైబడి టి టి యార్డ్ లో పని చేసాడు. ఆదివారం అయన మృతి వార్త తెలుసుకుని వివిధ పార్టీలకు చెందిన నాయకులు సుబ్బారావు మృతదేహానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు జన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, టి డి పి గ్రామ అధ్యక్షులు ఈపూరు బాబు, టి డి పి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధు సూ ధనరావు, టి టి యార్డ్ మేస్త్రి కోట్ల శ్రీనివాసరావు ఉన్నారు.

రెజ్లింగ్‌లో జిల్లాకు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈ నెల 4 నుంచి 6 వ తేదీ వరకు రాజమండ్రి ఎస్‌విపిసి కల్యాణ మండపంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 15 రెజ్లింగ్ పోటీల్లో ఎన్‌టిఆర్ జిల్లా రెజలర్లు నాలుగు బంగారు, ఐదు రజత, ఏడు కాంస్య పతకాలు సాధించి 42 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌తో ద్వితీయ స్థానంలో నిలిచారు. బి.కుమార్, సిహెచ్.తునిల్, బి.హేమంత్ సాయి తేజ, జి.శైలజ బంగారు పతకాలు కైవసం చేసుకుని జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్.కుమార్, కె.యామిని, డి.సంతోష్, టి.స్నేహ లత, పి.దీపిక రజత పతకాలు గెలుపొందారు. సిహెచ్.మోహన వంశీ, ఎస్.కుమార్ రెడ్డి, ఎం.శివ నాగ లక్ష్మి, టి.చిట్టెమ్మ, టి.వీణా మాధురి, కె.సుశాంత్, సి.హెచ్.బిందు కాంస్య పతకాలు సాధించారని ఎన్‌టిఆర్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఇన్చార్జి దాసరి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా బాల బాలికలకు చక్కటి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.వి.సత్య ప్రసాద్,టి. శ్రీలతను అభినందించారు.

పిబి సిద్ధార్థలో 8న ఎకాన్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆర్థికశాస్త్ర విభాగం, స్టూడెంట్స్ ఆఫ్ ఎకనామిక్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ నెల 8న నిర్వహిస్తున్న ఎకాన్ కార్యక్రమం పోస్టర్‌ని ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, కన్వీనర్ డాక్టర్ సిహెచ్.వి.రోహిణి కుసుమ విడుదల చేశారు. డిగ్రీ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు 2015 నుండి ఎకాన్ ఈవెంటును ఏటా నిర్వహిస్తున్నామని, రేపు జరిగే కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ మధుబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. స్టార్టప్ ఐడియా (అంకురాలోచన), వక్తృత్వం, క్విజ్, పోస్టర్ రూపకల్పన తదితర పోటీలను విద్యార్థులకు నిర్వహిస్తామన్నారు.

కంఠాభరణాలు బహూకరణ

ప్రజాశక్తి - గంపలగూడెం : తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఎర్రు పాలెం మండలం జమలా పురం వాస్తవ్యులు అజ్మీర శ్రీనివాసరావు, లక్ష్మీ దంపతులు, కుమార్తె దీపిక ఆదివారం గంపల గూడెం మండలం మెట్ట గుట్టలో

వేం చేసియున్న శ్రీశేషాచల శ్రీనివాసస్వామి సమేత గజలక్ష్మి అమ్మవారికి రూ.15వేలు విలువైన కంఠాభరణాలను వితరణగా అందజేశారు. ఆలయ ప్రధానా ర్చకులు శ్యాంసుందర శ్రీనివాసా చార్యులు దాతలను ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ చైర్మన్ పంది వెంకట్రావు దాతకు శేషవస్త్రం అందజేశారు. కమిటీ సభ్యులు ఆర్.వెంకట సుబ్బారావు, వి.ఆంజ నేయులు, వై.విజయ కుమార్ ఉన్నారు.

నేతాజీలో ఇంగ్లీష్ ల్యాబ్, మినరల్ వాటర్ ప్లాంట్

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురంలోని నేతాజీ హైస్కూల్లో ఇంగ్లీష్ ల్యాబ్, వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ సన్‌షైన్, ఎస్ఎసిఎ సహకారంతో నేతాజీ హైస్కూల్ ఐఐటి క్యాంపస్‌లో ఇంగ్లీష్ ల్యాబ్, హైస్కూల్ క్యాంపస్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఎ.లక్ష్మీ శ్రీనివాస్, ప్రెసిడెంట్ కరం బీర్ కౌర్, సెక్రటరీ షబానా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతాజీ స్కూల్ చైర్మన్ కె.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి ఐఐటి క్యాంపస్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఇంగ్లీష్ ల్యాబ్ వల్ల విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయని ఆయన వివరించారు. మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు పరిశుభ్రమైన మంచి నీరు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా సెకండ్ క్లాస్ విద్యార్థులు సేవ్ ఎన్విరాన్మెంట్– సేవ్ బర్డ్స్ గురించి వేసిన స్కిట్ ఆహుతులను అలరించింది. వెల్కమ్ సాంగ్‌లో ఏడోతరగతి విద్యార్థిని యామిని, ఎనిమిదో తరగతి విద్యార్థిని జ్యోతి శ్రీదేవి అలరించారు. ఈ కార్యక్రమాలలో స్కూల్ ప్రిన్సిపాల్ కందుల అరుణ కుమారి, కె.రాజేష్, కె.దినేష్, శిరీష, లావణ్య, స్కూల్ టీచర్స్ అందరూ పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

పటమట ఎలక్ట్రిసిటీ కాలనీలో కళ్యాణం జరుగుతున్న దృశ్యం

పటమట ఎలక్ట్రిసిటీ కాలనీలో కళ్యాణం జరుగుతున్న దృశ్యం

కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం

ప్రజాశక్తి - విజయవాడ. అర్బన్ : విజయవాడ పటమట ఎలక్ట్రిసిటీ కాలనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పటమట ఎలక్ట్రిసిటీ కాలనీ నల్లూరు చక్రధర్‌రావు అంజమ్మ రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ వైభవంగా జరిగింది. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి ఆలయ అర్చకులు కల్యాణాన్ని జరిపించారు. తొమ్మిది మంది దంపతులు స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వైసిపి జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి పాల్గొన్నారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని నల్లూరు కాశీ, నల్లూరు మాధవి దంపతుల ఆధ్వర్యంలో 4 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. నల్లూరు కాశీ, మాధవి, అఖిల్, చరిత యాత్రికులకు భోజనం వడ్డించి అన్నసమారాధన ప్రారంభించారు. ఎలక్ట్రిసిటీ కాలనీతో పాటు పరిసర కాలనీల నుంచి యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఏ గుడి ఉన్న లేకపోయినా రామాలయం తప్పకుండా నిర్మిస్తారని అన్నారు. ప్రపంచంలో కుటుంబ విలువలను, విధానాలను రామాయణం ద్వారా మాత్రమే ప్రజలు తెలుసుకోవడం జరిగిందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మద్దుకూరి సుబ్బారావు, నల్లూరు అఖిల్ మాట్లాడుతూ పటమట ఎలక్ట్రిసిటీ కాలనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14 వ సంవత్సరం సీతారాముల కళ్యాణం చేశామన్నారు.

ఐఎస్ఎ ఇ డైరెక్టరీ ఆవిష్కరణ

విజయవాడ : ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియా లోజిస్ట్స్ విజయవాడ సిటీ బ్రాంచ్ ఇ డైరెక్టరీని డాక్టర్ భవానీ శంకర్ (యుఎస్ఎ) ఆవిష్కరించారు. ఈ డైరెక్టరీలో విజయవాడకి చెందిన 150 మంది ఎనస్తీషియా వైద్యుల వివరాలు ఉంచినట్లు ఐఎస్ఎ రాష్ట్ర అకడమిక్ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ తెలిపారు. విజయవాడ ఐఎమ్ఎ హాల్లో విజయవాడ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియా లోజిస్ట్స్ నిర్వహించిన సిఎంఇ మీటింగ్‌లో డాక్టర్ కొడాలి భవానీ శంకర్ యుఎస్ఐ కాప్నోగ్రఫీ అబ్‌స్టెట్రిక్ ఎనస్తీషియా గురించి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ భవానీ శంకర్‌ను సన్మానించారు. ఈ సిఎంఇకి 100 మంది పైగా ఎనస్తీషియా వైద్యులు హాజరైనట్లు డాక్టర్ తారకప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒఐఎస్ఎ నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.వి.భీమేశ్వర్ డాక్టర్ కిరణ్ సిటీ సెక్రటరీ డాక్టర్ దివ్య రావెల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కీర్తి డాక్టర్ ఫణి డాక్టర్ రాజగోపాల్ డాక్టర్ వై.రమేషకుమార్ ఆయుష్ హాస్పిటల్ ఎమ్‌డి ఇసి మెంబెర్ డాక్టర్ శ్రీదేవి డాక్టర్ సూర్యశ్రీ పాల్గొన్నట్లు డాక్టర్ తారకప్రసాద్ తెలిపారు. డైరెక్టరీ తయారు చేసిన డాక్టర్ దివ్యరావెళ్ల డాక్టర్ కీర్తి చిగురుపాటిని అభినందించారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఎస్.ఆర్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోరంకి లోని విజ్ఞాన భారతి హై స్కూల్‌లో ఆదివారం జరిగిన అండర్ – 9 బాల బాలికల చెస్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా జరిగింది. ఓపెన్ టోర్నమెంట్‌లో నాలుగు రౌండ్లుగా పోటీలు జరిగాయని కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎన్.ఎం.ఫణి కుమార్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి రెండు స్థానాలు సాధించిన వారు ఏప్రిల్‌లో జరగనున్న అండర్ – 9 రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజ్ఞాన భారతి హైస్కూల్ డైరెక్టర్ కె.ఆర్.ఎస్.రావు, ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ అధ్యక్షులు పి.రేణుక, చీఫ్ ఆర్బిటర్ ఎం.పావని విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందచేశారు.

విజేతల వివరాలు..

అండర్ – 9 బాలుర విభాగంలో ఎం.కార్తికేయ, కె.వేదాంత మౌర్య ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో అయ్యార్ జహీన్, డి.సత్య నేహ సరిత, జె.డివిష చౌదరి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో ముగ్గురికి ఒకేవిధమైన పాయింట్లు రావడంతో ముగ్గురిని ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఓపెన్ కేటగిరీ....

ఓపెన్ కేటగిరీలో మొత్తం 26 మంది క్రీడాకారులు పాల్గొనగా ఐదు రౌండ్లుగా పోటీలు నిర్వహించారు. రుషీల్ సాయి, లలిత్ కౌశిక్, కె.సందీప్ మొదటి మూడు స్థానాలు సాధించారు.

మాట్లాడుతున్న గంగాధర్

28 నుండి సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - తిరువూరు : విద్యార్థులకు వేసవి సెలవుల్లో విజ్ఞానంతో పాటు, వినోదాన్ని అందించేందుకు తిరువూరు జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఏప్రిల్ 28నుండి తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ తెలిపారు. శనివారం రాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన జెవివి సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్ లో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆరోగ్య రీత్యా ప్రజలు శీతల పానీయాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. జెవివి అధ్యక్షులు ఎం.సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెవివి జిల్లా కార్యదర్శి ఎం.రాం ప్రదీప్, మండల ప్రధాన కార్యదర్శి డి.సుదర్శన్, గౌరవాధ్యక్షుడు పి.శీనయ్య, సీనియర్ సభ్యులు కె.పాపారావు, ప్రజా సంఘాల నాయకులు బి.వెంకటేశ్వరావు, ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.